## క్లుప్తంగా

### విజయవాడకు పారిశుద్ధ్య సిబ్బంది

హిరమండలం: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సంరక్షణ పనులు చేసేందుకు హిరమండలం మేజర్ పంచాయతీ నుంచి పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది నలుగురు సోమవారం వెళ్లారు. ఈ మేరకు మేజర్ పంచాయతీ ఈఓ వైఎస్సార్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా వారంపాటు అక్కడే సేవలందిస్తారన్నారు.

### కూలిన ప్రహరీ



ప్రహరీని పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: తుఫాన్ కారణంగా శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. స్థానిక తహసీల్దార్ బి.వెంకరమణ ప్రహరీని సోమవారం పరిశీలించారు. అధికారుల ఆదేశాలతో మరమ్మతు పనులను మండల ఇంజినీర్ రామరావు, సచివాలయం ఇంజినీర్ అసిస్టెంట్ పవన్ సమక్షంలో చేపట్టారు. సర్పంచ్ ఎల్.రోజారాణి, గ్రామ పెద్ద లంక రామారావు ఉన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ఖాన్

హిరమండలం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటినప్పటికీ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు ప్రమత్తంగా ఉండాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ఖాన్ అన్నారు. సోమవారం వంశధార గొట్టాబ్యారేజీ వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. గొట్టాబ్యారేజీ కార్యాలయంలో వంశధార అధికారులతో మాట్లాడి బ్యారేజీ ఇన్ఫ్లో, అవుట్ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒడిశా క్యాచ్మెంట్ ఏరియాలో వర్షపాతం నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెక్కలి ఆర్డీ సుదర్శన్దొర, తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎంపీడీఓ బి.శైలజ, వంశధార డీఈఈ రంగనాయకులు, రెవెన్యూ, వంశధార అధి కారులు పాల్గొన్నారు

### రెల్లిగెడ్డపై అక్రమ కట్టడం



మొదలవలసలోని రెల్లిగెడ్డ గట్టుపై నిర్మించిన షెడ్

పొందూరు: మొదలవలస గ్రామంలోని రెల్లిగెడ్డ గట్టుపై మొదలవలస ఉదయ్కుమార్ ఆయన తండ్రి రాఘవరావు జ్ఞాపకార్థం విగ్రహం ఏర్పాటు, షెడ్ను అక్రమంగా నిర్మిస్తున్నారని, దానిని వెంటనే నిలుపుదల చేయాలని ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ కార్యదర్శికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్పందించలేదు. ఈ అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలని జిల్లా ఉన్నతాధికారులను సోమవారం ఫిర్యాదుదారుడు కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత నిర్మాణాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించి రెల్లిగెడ్డపై అక్రమ కట్టడంగా గుర్తించారు. నిర్మాణం నిలుపుదల చేయాలని రాఘవరావుకు ఆదేశించారు. అయినప్పటికీ నిర్మాణం నిలుపుదల చేయకుండా పూర్తిచేశారు. పూర్తి స్థాయి బస్సు షెడ్గా రూపొందించారు. అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, పోలీసు అధికారులను నీటి పారుదల శాఖ అధికారులు కోరారు. నీటిపారుదల శాఖ అధికారులు అన్ని విధాలా అందుబాటులో ఉంటే తగిన సహకారం అందిస్తామని తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్ తెలిపారు.

### అంతిమ సంస్కారాలకు అవస్థలు

పొందూరు: మండలంలోని కొల్లిపేట గ్రామానికి చెందిన గదల తవుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వర్షం విపరీతంగా కురవడంతో దహన సంస్కారాలు చేసేందుకు బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. పొలం గట్ల పైనుంచే వర్షంలో శవాన్ని మోసుకెళ్లారు. చిన్న ఖాళీ ప్రదేశంలో టార్పాలిన్లతో గుడారాన్ని ఏర్పాటు చేశారు. తాటికమ్మలు, టైర్లు వంటి వాటితో దహన సంస్కారాలు చేశారు. సోమవారం బూడిదను తెచ్చేందుకు వెళ్లేసరికి కొట్టుకుపోయింది. మొత్తం నీటిలో మునిగిపోయింది. బూడిద కూడా దొరకకపోవడంతో మృతుడి భార్య కన్నీరుమున్నీరైంది. శ్మశానానికి ఎకరా ఐదు సెంట్లు ఉంది. అదంతా కబ్జాకు గురైంది. శ్మశానానికి వెళ్లేందుకు రహదారి, భవనం ఏర్పాటు చేయాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.



నరసన్నపేట: కోమర్తి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పోలాకి ఓపెన్ హెడ్ చానల్



ఎల్.ఎన్.పేట: కోవిలాం కాలనీ వద్ద ఏబీ రోడ్డుపై వరద నీటికి అడ్డుకట్టు వేసే పనులు చేపడుతున్న దృశ్యం

# ముంపులోనే పంట పొలాలు


- ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలను ముంచెత్తాయి. శని, ఆదివారాల్లో కురిసిన వానలతో ఇంకా పలు ప్రాంతాలు వరదగొప్పెట్లోనే ఉన్నాయి. సోమవారం వర్షం లేనప్పటికీ వరద మాత్రం తగ్గలేదు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు సోమవారం పరిశీలించారు. వాయుగుండం తీరం దాటిప్పటికీ మరో రెండు, మూడు రోజులపాటు నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి రైతలకు సూచనలిచ్చారు.

– సాక్షి నెట్వర్క్



నరసన్నపేట: మడపాం వద్ద ఉద్ధృతంగా ఉన్న వంశధార



కొత్తూరు: నివగాం బ్రిడ్జి వద్ద వంశధార నది వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ పాపారావు



జలుమూరు: పాగొడు వద్ద పంట పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



పాతపట్నం: రొంపివలసలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ రవికుమార్



బూర్జ: పనుకపర్తలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



సారవకోట: నౌతల సమీపంలోని భూములను పరిశీలిస్తున్న అధికారులు



నరసన్నపేట: మడపాం వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ సునీత, తదితరులు



మెళియాపుట్టి: మహేంద్రతనయ వంతెనను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ఖాన్



పాతపట్నం: మహేంద్రతనయ నదీ ప్రవాహన్ని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ఖాన్, అధికారులు



నరసన్నపేట: మడపాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేరిన వర్షం నీరు



కొత్తూరు: మాతల వద్ద వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ స్వర్ణలత



పాతపట్నం: పాతపట్నం వద్ద కాజ్వేపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుదర్శన్ దొర



ఎల్.ఎన్.పేట: వంశధార తీర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ త్రినాథులు, వైఎస్సార్సీపీ నాయకులు



కొత్తూరు: కొత్తూరులో పాడైన వంగ పంటను చూపిస్తున్న రైతులు



నరసన్నపేట: గెడ్డవానిపేట వద్ద వంశధార ఉద్ధృతిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి అనురాధ



జలుమూరు: పంట పొలాన్ని పరిశీలిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

# కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

సాక్షి టాస్క్ ఫోర్సు: బూర్జ మండలం చీడివలస గ్రామ మెయిన్ అంగన్వాడీ నిర్వాహకులు కలెక్టర్ ఆదేశాలు, ఉత్తర్వులను సైతం బేఖాతర్ చేశారు. అంగన్వాడీ కేంద్రానికి సోమవారం తాళం వేసి విధులకు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో ఈ గ్రామం ఉన్నా.. కనీసం పైఅధికారుల ఆదేశాలు పట్టించుకోలేదు. గతంలో కూడా విధుల పట్ల అలసత్వం వహించినప్పుడు పైఅధికారుల దృష్టికి స్థానికులు తీసుకువెళ్లడం జరిగింది. అయినా ఫలితం శూన్యం. వరద సహాయక చర్యల్లో భాగంగా గ్రామ సచివాలయాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశారు. అంగన్వాడీ సిబ్బందికి సెలవును రద్దు చేస్తూ.. ఈ అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ వరద ప్రమాద సమయంలో కూడా వీరిలో మార్పురాకపోవడంతో గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



మూతపడిన చీడివలస అంగన్వాడీ కేంద్రం

### 14న లోక్ అదాలత్

పాతపట్నం: ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసులను కక్షిదారులు లోక్ అదాలత్లో రాజీ ద్వారా పరిష్కారం చేసుకుంటే శ్రమ, సమయం తగ్గుతుందన్నారు. దీని ద్వారా గ్రామాల్లో తగాదాలు తగ్గి స్నేహభావం పెరుగుతుందన్నారు. కోర్టు వరకు వెళ్లని తగాదాలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. క్రిమినల్, ఇతర కేసుల విషయంలో కక్షిదారులకు న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించి రాజీ కుదిరేలా చూడాలన్నారు. రాజీ అన్ని విధాలా ఉత్తమ మార్గమన్నారు.

# గ్రామాల్లో వైద్య శిబిరాలు



జలుమూరు: వైద్య సేవలు అందజేస్తున్న వైద్యాధికారి సుజాత



నరసన్నపేట: అంబోజీపేటలో వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు అరవింద్



పొందూరు: వైద్య సేవలందిస్తున్న వైద్యులు

పొందూరు: స్థానిక పార్కు స్కూల్ ఆవరణలో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరం, బీపీ, సుగర్, దగ్గు తదితర రోగులు 96 మందికి వైద్యులు రమేష్నాయుడు, కె.నవీన్ వైద్య సేవలందించారు. సీహెచ్ఓ సుగుణమ్మ, హెచ్ఎస్ రాములు, హెల్త్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తం**

జలుమూరు: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అచ్యుతాపురం పీహెచ్సీ వైద్యాధికారి పూజారి సుజాత అన్నారు. సోమవారం యలమంచిలిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటా సర్వే నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. ఆరోగ్యవిస్తరణ అధికారి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

**లుకలాం, అంబోజీపేటల్లో..**

నరసన్నపేట: మండలంలోని లుకలాం, అంబోజీపేటల్లో ఉర్లాం పీహెచ్సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో 310 మందికి వైద్య పరీక్షలు చేశామని డాక్టర్ అరవింద్ అన్నారు. గ్రామాల్లో జ్వరాలు అక్కడక్కడా ఉన్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవాడకు వరద.. ప్రభుత్వ వైఫల్యమే..

- చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే..
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 50 మంది మృతి
- మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: వరదలు వస్తాయని ముందుగా హెచ్చరికలు ఉన్నప్పటికీ సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ వరదల కారణంగా 50 మంది వరకు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్షం వల్లే ఈ మరణాలు సంబవించాయని అభిప్రాయపడ్డారు. ముందుస్తుగా సరైన జాగ్రత్తలు తీసుకుని ఉంటే అమాయకుల ప్రాణాలు నిలిచేవన్నారు. ప్రజలను సకాలంలో తరలించడం, పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయడం వంటివి చంద్రబాబు ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. వరద ఉద్ధృతి ఒక్కసారిగా విజయవాడపై పడటంతో ప్రజలు ఎనిమిది రోజులు బురద నీటిలోనే ఉన్నారన్నారు. వరద బాధితులు అన్నమో రామచంద్రా అంటూ అలమటించారన్నారు. వరద బాధితులకు సహాయం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్పందించారన్నారు. వీరి వితరణ సక్రమంగా బాధితలకు చేరలేదని దీనికి కారణం ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేకపోవడమేనన్నారు. ఇంత చేతకాని ప్రభుత్వం మరోకటి లేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వరద ప్రాంతాల్లో తిష్ట వేస్తే అధికార యంత్రాంగం అంతా ఆయన చుట్టూ ఉంటుందని, దీంతో సహాయక చర్యలు చేపట్టడంలో ఇబ్బంది అవుతుందన్నారు. ఇప్పుడు అదే జరిగిందన్నారు. వరద బాధితలను ఆదుకోవడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు.

**వలంటీర్ వ్యవస్థ ఉంటే సకాలంలో సేవలు..**

వలంటీర్ వ్యవస్థ ఉంటే వరద బాధితులకు పూర్తిగా న్యాయం జరిగేదని కృష్ణదాస్ అన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరోనాతోపాటు అనేక ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు పూర్తిగా మేలు జరిగిందని, ఎక్కడా బాధితులు ఇబ్బంది పడలేదని, దీనికి కారణం వలంటీర్ వ్యవస్థేనని అన్నారు. వరదలు వచ్చి వారం అవుతున్నా ఇప్పటికీ బాధితుల ఆక్రందనలు వినిపిస్తున్నాయంటే ఈ ప్రభుత్వ చేతకాని తనం బట్టబయలైందన్నారు.

### నిండుకుండలా రంగసాగరం



సారవకోట మండలంలోని పొప్పంగి సమీపంలో ఉన్న రంగసాగరం చెరువు నిండుకుండలా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చుట్టు పక్కల నుంచి వరద వచ్చి చేరడంతో చెరింది. – సారవకోట

### వినాయకునికి 108 రకాల ప్రసాదాలు



వినాయక విగ్రహం వద్ద పెట్టిన ప్రసాదాలు

కొత్తూరు: మండల కేంద్రంలోని రామారావు నాయుడు షాపింగ్ కాంప్లెక్స్లో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద సోమవారం 108 రకాల ప్రసాదాలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంప్లెక్స్ యజమాని గోగుల బాలచంద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాలకొండ రోడ్డులోని వినాయక మండపం వద్ద అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

### ఈ సరదా ప్రమాదం కాదా?



నెల్లిమెట్ట రహదారిలో వరద నీటిలోకి దూకుతున్న యువకులు

రెల్లిగెడ్డ వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో సింగూరు, నెల్లిమెట్ట యువత ఈత సరదా తీర్చుకుంటున్నారు. ఈతకు వెళ్లొద్దు ప్రమాదమని పెద్దలు చెబుతున్నా.. వారి హెచ్చరికలను పట్టించుకోవడంలేదు.

– పొందూరు

### రూ.10 లక్షల విరాళం



చంద్రబాబుకు చెక్ను అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల విరాళాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వితరణ చేశారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం చెక్ను అందజేశారు.

# నిబంధనలు పాటించాలి



కాజ్వే వద్ద బోర్డును ఏర్పాటు చేసిన సీఐ సాయి

పాతపట్నం: స్థానిక నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న (మహేంద్రతనయ నదీపై) కాజ్వేపై నుంచి నీరు ప్రవహిస్తున్నందున వినాయక విగ్రహాల నిమజ్జనాల సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పాతపట్నం సీఐ నల్లి సాయి అన్నారు. సోమవారం సీఐ మాట్లాడుతూ నదీలో ఎవరూ దిగవద్దని, నదీ లోపల వరకు వినాయక విగ్రహాలను నిమజ్జనాలు చేయవద్దన్నారు. గ్రామాల్లో విగ్రహాల నిమజ్జనాల సమయంలో గొడవలు లేకుండా చూసుకోవాల్సి బాధ్యత కమిటీ సభ్యులదేనని, సాంస్కృతిక కార్యక్రమాలు పేరుతో రికార్డుంగ్ డాన్స్లు వేస్తే కేసులు నమోదు చేస్తామని, గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంటుందన్నారు. నిమజ్జనం రోజు చిన్న పిల్లలను, వృద్ధులను, మహిళలను నది వరకు తీసుకువెళ్లరాదని, సాయంత్ర 6 గంటల లోపే నిమజ్జనం చేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ లావణ్య పాల్గొన్నారు.